క్లుప్తంగా

ముగిసిన కబడ్డీ పోటీలు



షీల్డ్ అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: మోతుగూడ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. గెలుపొందిన జట్లకు సర్పంచ్ సువర్ణ, ఉప సర్పంచ్ రజితలు నగదు బహుమతి అందజేశారు. ప్రథమ బహుమతి అందెవెల్లి జట్టుకు రూ.10,000, ద్వితీయ బహుమతి మోతుగూడ జట్టుకు రూ. 5వేలు అందజేశారు. కార్యక్రమంలో యూత్ సొసైటీ సభ్యులు వినోద్, జానకిరాం, శ్రీనివాస్, మహేష్, చరణ్, సాయి, రాందాస్, కల్యాణ్ తదితరులు ఉన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు అంబేద్కర్ భవనానికి ఎదురుగా రూ. 2.50లక్షల నిధులతో నిర్మించ తలపెట్టిన డ్రెయినేజీ పనులను ఆదివారం వార్డు కౌన్సిలర్ లావణ్య శరత్ ముదిరాజ్ ప్రారంభించారు. పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు.

నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ



మాట్లాడుతున్న సీఐ నాగరాజు

పెంచికల్‌పేట్: మండలంలోని నందిగామ గ్రామంలో కాగజ్‌నగర్‌రూరల్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో గ్రామంలోని 15 నిరుపేద కుటుంబాలకు ఆదివారం దుప్పట్లు, బియ్యం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు మీకోసం కార్యక్రమంలో ఇప్పటికే గిరిజన గ్రామాల్లో అనేక కార్యక్రమాలు చేపడుతామన్నారు. గ్రామాల్లో నూతన వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దన్నారు. కార్యక్రమంలో పెంచికల్‌పేట్ ఎస్సై విజయ్‌కుమార్, సర్పంచ్ పార్వెటి మధునయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

హమారా ప్రసాద్‌ను శిక్షించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని పెంచికల్‌పేట్ దళితసంఘాల ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎల్కపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి హమారా ప్రసాద్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బౌద్ధ మండల అధ్యక్షుడు భీమయ్య, నాయకులు లహాన్ రాజ్, దూగుంట రాజన్న, భిక్షు రాంచందర్, సదాశివ్, రాజేష్, ప్రేమానందరం, దేవాజీ, బాబులాల్, కిరణ్, గోపాల్, భూషణ్, రావూజీ, రవికుమార్ పత్రు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు కరాటేలోనూ రాణించాలి

మందమర్రిరూరల్: విద్యార్థులు చదువుతో పాటు కరాటేలోనూ రాణించాలని ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. మందమర్రి ఏరియాలోని సీఐఎస్ఎఫ్ క్యాంపస్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఆల్ స్టైల్స్ ఫస్ట్ ఓపెన్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్–2023 పోటీలను ప్రారంభించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మస్థైర్యంతో పాటు శరీర ధారుఢ్యం పెరుగుతుందన్నారు. విద్యార్థుల పేరెంట్స్ ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు శ్రీనివాస్, సందీప్, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, క్రీడాభిమానులు, క్రీడాకారులు ఉన్నారు.

మల్లన్న ఆలయంలో బోనాల సందడి

చెన్నూర్‌రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని మండలంలోని కత్తెరసాల గ్రామంలోని శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా, ఆలయ ఆవరణ కిక్కిరిసింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో బోనాలు పోసి తీపి పదార్థాలతో స్వామి వారికి నైవేద్యం పెట్టారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు. శివ సత్తుల పూనకాలతో ఆలయ ఆవరణ మారుమోగింది.

వేతనం రాదు.. సమస్య తీరదు

- భారమవుతున్న కుటుంబ పోషణ
- ఐదు నెలలుగా అందని జీతాలు
- ఇబ్బందులు పడుతున్న పారిశుద్ధ్య కార్మికులు



ఆగర్‌వాడ పాఠశాలను శుభ్రం చేస్తున్న కార్మికుడు



మోడిలో అవెన్యూ ప్లాంటేషన్‌కు నీరు పోస్తున్న జీపీ కార్మికులు

కెరమెరి: ఐదు నెలలుగా వేతనాలు రాక పారిశుద్ధ్య సిబ్బంది తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఉదయం నుంచి సాయంకాలం వరకు వీధులను శుభ్రం చేయడంతో పాటు వివిధ రకాల పనులు చేసే కిందిస్థాయి సిబ్బందికి తమ కుటుంబాల పోషణ భారంగా మారింది. ఫలితంగా కొంతమంది కార్మికులు విధుల నుంచి స్వచ్ఛందంగా వైదొలుగుతున్నారు.

మండలంలో 31 జీపీలు..

మండలంలో మొత్తం 31 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటిల్లో సుమారు 102 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఇప్పటికే కొందరు విధుల నుంచి తప్పుకున్నారు. మరికొంత మంది అదే బాటలో పయనించేందుకు సిద్ధమవుతున్నారు. ఉదయం గ్రామాల్లో రోడ్లను శుభ్రం చేసి చెత్త తొలగించడం, పాఠశాలలు, మురికి నాలీలు శుభ్రం చేయడం, అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలను నీరు పట్టడం, నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయడం, చెత్తాచెదారం లేకుండా పల్లెలను స్వచ్ఛతగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారు.

నిబంధనలు అడ్డు..

ప్రస్తుతం గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. కాని వసూలు చేసిన డబ్బుల నుంచి కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి నిబంధనలు అంగీకరించడం లేదు. వసూలు చేసిన డబ్బులను ఎస్‌బీఐ, వాంకిడి బ్యాంకులో గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత చెక్కు రాసి ట్రెజరీలో జమచేయాలి. చెక్కులు పాస్ అయితే తప్ప పంచాయతీల చేతికి డబ్బులు అందవు. కాగా డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు జమ చేయగా, రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల్లో ఆ నిధులు కూడా లాగేసుకుంది. ఈ నేపథ్యంలో పంచాయతీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

పూట గడవడం కష్టంగా ఉంది



ఉదయం నుంచి సాయంకాలం వరకు గ్రామ పంచాయతీలో ఎన్నో రకాల పనులు చేస్తున్నాం. కాని ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదు. పూట గడవడం కూడా కష్టంగా ఉంది. వెంటనే వేతనాలు అందించాలి.

– భుజంగ్‌రావు, పారిశుద్ధ్య కార్మికుడు, సాకడ

రెండు రోజుల్లో నిధులు జమ



మరో రెండు రోజుల్లో ఆయా గ్రామ పంచాయతీల్లో నాలుగు మాసాల వేతనాలు జమయ్యే అవకాశం ఉంది. చిన్న గ్రామ పంచాయతీల్లో మాత్రమే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు అందడం లేదు.

– సుదర్శన్, ఎంపీవో, కెరమెరి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ విశ్వనాథ్

కౌటాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని సాండ్‌గాం గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన రవాణ వ్యవస్థ కల్పించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. అన్ని గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. సాండ్‌గాంలో సీసీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎకోన్‌కార్ దామోదర్, నాయకులు రాంచందర్, మురళీ, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలయేసు పండుగ



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కౌటాల: మండల కేంద్రంలోని కాథలిక్ చర్చిలో బాలయేసు పండుగను ఆదివారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ కురియన్ క్రైస్తవులకు దేవుని వ్యాఖ్యం బోధించారు. ప్రజలు ప్రేమ కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా యువతీయువకులు చేసిన పలు సంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అలాగే స్థానిక చర్చి నుంచి కౌటాల ఆర్టీసీ బస్టాండ్ వరకు క్రైస్తవులు శాంతి ర్యాలీ తీశారు. కార్యక్రమంలో ఫాదర్లు టోమ్, మనోజ్, సతీష్, సీజో, బైజు, ప్రవీణ్, క్రైస్తవులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులకు అన్నం వడ్డిస్తున్న ఆలయ పూజారి దేవార వినోద్

రెబ్బెన: మండలంలోని ఇందిరా నగర్‌లో గల శ్రీ కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులో భాగంగా తలనీలాలు సమర్పించి అమ్మవారికి ఓడి బియ్యం, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం అభినందనీయం



కౌటాల: పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కౌటాల: మండలంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. కౌటాలలోని నజరేత్ మిషన్ ప్రైవేట్ హాస్పిటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందన్నారు. వైద్యులు సుమిత్ కుమార్, గంగారం, రామదేవి, గోపికుమార్, శ్రీనివాస్, నాగరాజు, ప్రణవ్ కృష్ణ, సృజి, ప్రవీణ్ సింగ్, రమ్య, మహాలక్ష్మి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కాగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించిందని, శిబిరంలో మొత్తం 870 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు తెలిపారు. 50 మందికి క్యాన్సర్ పరీక్షలు చేయగా అందులో 15 మందికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దుబ్బుల నానయ్య, సర్పంచ్ వొజ్జల మౌనిశ్, ఎంపీటీసీ బొమ్మకంటి మనీష్, ఉప సర్పంచ్ తిరుపతి, నిర్వాహకులు కిరణ్, ఆగస్టిన్, ఫ్రాన్సిస్, సోనికుమార్, ప్రశాంత్, శ్రావణ్, అరుణ్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని లైఫ్‌లైన్ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన వచ్చింది. డాక్టర్ ప్రదీప్ కుమార్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వెనుబడిన ప్రాంతంలో తక్కువ ధరలతో వైద్య సేవలు ఏర్పాటు చేశామన్నారు. శిబిరాన్ని 200 మంది రోగులు సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరఘాట్ పరిశీలన

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో ఉన్న గోదావరి పుష్కరఘాట్‌ను ఆదివారం మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రాజయ్య పరిశీలించారు. ఈ నెల 18వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా భక్తులు పవిత్ర స్నానాలు చేసేందుకు పెద్ద ఎత్తున తరలి రానుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ అధికారులను ఆదేశించారు. వార్డు కౌన్సిలర్లు బాదావత్ ప్రకాశ్‌నాయక్, అంకం నరేశ్, నాయకులు రవీందర్‌రావు, తాజ్ పాల్గొన్నారు.

మైనార్టీ రుణాలకు ఇంటర్వ్యూలు

నెన్నెల: మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఈ నెల 14, 15వ తేదీల్లో గ్రామసభల ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వరలక్ష్మి తెలిపారు. 14న నెన్నెల, కోణంపేట, కుశ్నపల్లి, మైలారం గ్రామపంచాయతీ అభ్యర్థులకు, 15న గుండ్లసోమారం, నార్వాయిపేట, మెట్‌పల్లి, చిత్తాపూర్, ఆవుడం, కొత్తూర్ గ్రామాల మైనార్టీలకు వారి గ్రామపంచాయతీల్లో గ్రామసభలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభ్యర్థులు రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాం, విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డుతో పాటు బ్యాంకు ఖాతా పుస్తకం వెంట తీసుకురావాలన్నారు.

అధిక ధరలకు మద్యం..!

- నిబంధనలు బేఖాతరు
- మద్యం దుకాణాలపై నియంత్రణ కరువు
- రహదారి పక్కనే బెల్టు షాపులు



రహదారి పక్కనే ఉన్న వైన్స్, బెల్టు షాపు



గూడెంలోని మద్యం దుకాణం వద్ద రహదారిపై నిలిపిన వాహనాలు

చింతలమానెపల్లి: మండలంలో మద్యం అమ్మకాల తీరుతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ధరలు పెంచి నిబంధనలను ఉల్లంఘించి నిర్వహిస్తున్న మద్యం అమ్మకాలపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని రవీంద్రనగర్, గూడెంలలో మద్యం దుకాణాలను ప్రభుత్వం మంజూరు చేసింది. గతంలో రవీంద్రనగర్‌లో మాత్రమే మద్యం దుకాణం ఉండేది. ఈసారి తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దు సమీపంలోని గూడెంలో ప్రభుత్వం మరో మద్యం దుకాణం ఏర్పాటు చేసింది. సరిహద్దు వద్ద ప్రాణహిత నది వంతెన సమీపంలో మహారాష్ట్రలోని అహేరి నుంచి చింతలమానెపల్లికి వచ్చే మార్గంలో ఈ మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు.

అధిక ధరలకు అమ్మకాలు..

మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ఉన్న గూడెంలోని మద్యం దుకాణంలో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒక బీరును సుమారు రూ. 20 నుంచి రూ.30ల అధిక ధరకు, విస్కీని రూ.50ల అధిక ధరకు విక్రయిస్తున్నారు. మరోవైపు ఇక్కడి నుంచి అక్రమంగా అధిక మొత్తంలో మద్యాన్ని మహారాష్ట్రకు చేరవేస్తున్నట్లు సమాచారం.

పగలు మద్యం దుకాణం.. రాత్రి బెల్టు దుకాణం..

నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలను నిర్ణీత వేళల్లో నిర్వహించాల్సి ఉంటుంది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం దుకాణం తెరిచి ఉండాలి. కాని ఉదయం 11గంటల వరకు షాపును తెరవడం లేదు. సాయంత్రం కూడా నిర్వాహకులు త్వరగా మూసివేస్తున్నారు. మద్యాన్ని బెల్టు షాపుల ద్వారా అధిక ధరలకు విక్రయించేందుకే షాపు త్వరగా మూసి వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం 11గంటల వరకు, తిరిగి సాయంత్రం, రాత్రి వేళల్లో యథేచ్ఛగా బెల్టు దుకాణాల ద్వారా అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. తెల్లవారు జామున 3 గంటల నుంచే బెల్టు షాపుల్లో మద్యం విక్రయించడం గమనార్హం.

ప్రజలకు ఇబ్బందులు..

సరిహద్దుల్లో ఉన్న ప్రాణహిత నది సమీపంలో ఏర్పాటు చేసిన దుకాణం కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అహేరి నుంచి చింతలమానెపల్లి వైపు రావడానికి ఒకే మార్గం కావడంతో ఈ మార్గంలో ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. మరోవైపు ప్రాణహిత నదిపై నిర్మించిన వంతెన పర్యాటకులను ఆకర్షిస్తోంది. నదిలో స్నానాలు ఆచరించడానికి, నదిని సందర్శించడానికి వచ్చేవారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. వీరికి మద్యం దుకాణం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మద్యం దుకాణంతో పాటు బెల్టు షాపులు రహదారి పక్కనే ఉన్నాయి. రహదారిపైనే మందుబాబులు వాహనాలు నిలిపి ఉంచుతుండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి వరకు మందుబాబులు సమీపంలోని పరిసరాలలో సిట్టింగ్‌లు వేస్తుండగా ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చెందాల్సిన ప్రాంతం మద్యం అమ్మకాల కారణంగా సమస్యాత్మకంగా మారుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

మద్యం దుకాణాలలో మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు. గూడెంలోని మద్యం దుకాణంపై నిఘా పెడుతాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– విలాస్, ఎక్సైజ్ సీఐ, కాగజ్‌నగర్

ఎక్కడి చెత్త అక్కడే..!

సింగరేణి ఉద్యోగులు నివాసం ఉండే ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచేందుకు యాజమాన్యం ప్రతినెలా లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా సివిల్ అధికారుల పర్యవేక్షణ లోపమో, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో తెలియదు కాని కార్మిక వాడల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. చెత్త కుండీల వద్ద చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు కాలువలు పూడిక, ప్లాస్టిక్ కవర్లతో నిండి ఉన్నాయి. దీంతో మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయని, తద్వారా రోగాల బారిన పడాల్సి వస్తుందని స్థానికులు వాపోతున్నారు.

– రెబ్బెన



6వ బ్లాక్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం



మూతలేకుండా ప్రమాదకరంగా డ్రెయినేజీ మ్యాన్‌హోల్



2వ బ్లాక్ మూడో లైన్ సమీపంలో పేరుకున్న చెత్తాచెదారం



చెత్తాచెదారంతో నిండిన మురికికాలువ

బాధితునికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామం పెర్క సంతోశ్‌కు చెందిన పత్తి, వరిధాన్యం ఇటీవల అగ్ని ప్రమాదంలో దగ్ధం కాగా, ఆదివారం జిల్లా మున్నూరు కాపు సంఘం నాయకులు బాధితునికి ఆర్థిక సాయం అందజేశారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సేకరించిన రూ. 24,500లను బాధితుడికి అందజేశారు. వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్ట వెంకన్న, గౌరవ అధ్యక్షుడు గజ్జి రామయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు కలికోట రమణయ్య, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గడ్డల సురేశ్, ఉపాధ్యక్షుడు బొమ్మెక్ల కిషన్, జిల్లా సలహాదారులు తాటి రాంచందర్, అడప సతీశ్, సుంకరి తిరుపతి, కోటేశ్, మహేశ్, పెంటయ్య, సాయి, రవి తదితరులు పాల్గొన్నారు.

హక్కులు సాధించుకోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: ఐక్య పోరాటాలతో హక్కులు సాధించుకోవాలని టీయుడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహెమాన్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.